నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I | హైదరాబాద్, ఆదివారం 11 ఆగస్టు 2024 | SIDDIPET




సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో నేలపై కూర్చుని భోజనం చేస్తున్న విద్యార్థులు, వడ్డిస్తున్న చిన్నారులు

# సమస్యలతో చదువు సాగేదెలా !

- వర్షం కురిస్తే విద్యార్థులు తడవాల్సిందే..
- దోమల బెడదతో విషజ్వరాల భయం
- డైనింగ్ రూం లేక ఆరుబయట నేలపై సామూహిక భోజనాలు
- సంగారెడ్డి బీసీ గురుకులంలో విద్యార్థుల అవస్థలు
- సొంత భవనాలు లేక బీసీ విద్యార్థుల ఇక్కట్లు

## తరగతి గది...డార్మెటరీ రెండూ ఒక్కటే • రేకుల ఇరుకు గదిలోనే చదువు.. ఆపై అక్కడే నిద్ర

ఒక ఇరుకు రేకుల గదులు..ఆ గదుల్లోనే చుట్టూరా బస్తాలు, ట్రంకు పెట్టెలు..ఎదురుగా గోడకు బ్లాక్‌బోర్డు..ఒక్కో ఇరుకు గదిలో 35 మంది విద్యార్థులు. పగటి పూట బస్తాలు, ట్రంకుపెట్టెల మధ్య నేలపై కూర్చుని పాఠాలు వింటారు. ఏకాగ్రతతో కాదు ముక్కులు మూసుకుని చదువుకుంటారు. తరగతి గదుల పక్కనే టాయిలెట్లు ఉండటంతో అక్కడి నుంచి వచ్చే దుర్గంధం భరించలేక విద్యార్థులు ముక్కుమూసుకుని కూర్చుంటున్నారు. అదే రేకుల గదిలో ఫ్యాన్ లేక ఉక్కపోస్తున్నా..రేకులకు చిల్లులు పడి వర్షానికి నీళ్లు కురుస్తున్నా పగటిపూట చదువు, రాత్రి పూట నిద్రపోతారు. పగటిపూట తరగతి గదులే రాత్రి పూట డార్మెట్రీలుగా మారుతాయి. ఇదంతా ఎక్కడో మారుమూల గురుకుల పాఠశాలలో పరిస్థితి కాదు. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాల దుస్థితి ఇది. సరైన మౌలిక వసతులు లేక అద్దె భవనాల్లో బీసీ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు పడుతున్న అవస్థలకు సంగారెడ్డిలోని బీసీ గురుకుల పాఠశాల అద్దం పడుతున్నది.





సంగారెడ్డిలోని జ్యోతిరావుపూలే గురుకులంలో తరగతిగదిలో ట్రంక్‌పెట్టెలు, బస్తాల మధ్య చదువుకుంటున్న చిన్నారులు, ఆరుబటయ స్నానాలు చేస్తున్న విద్యార్థులు, బీసీ గురుకుల పాఠశాలలో పేరుకుపోయిన మురుగు,

సంగారెడ్డి,ఆగస్టు10(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో 11 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆరు బాలికల, నాలుగు బాలుర కళాశాలలు, ఒక మహిళా డిగ్రీ కళాశాల ఉంది. సంగారెడ్డిలోని ప్రశాంతనగర్‌లో 5 నుంచి 9 తరగతి వరకు బీసీ గురుకుల పాఠశాల ఉంది. జిల్లా పరిషత్ అతిథి గృహంలో బీసీ బాలుర హాస్టల్ కొనసాగుతున్నది. దీనికి ప్రతి నెలా అద్దె చెల్లిస్తున్నారు. బీసీ గురుకుల పాఠశాలలో మొత్తం 336 మంది విద్యార్థులు ఉన్నారు. వీరంతా జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారు. ప్రస్తుతం గురుకుల పాఠశాలలో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. గురుకుల పాఠశాలలో రెండు భవనాలు, ఐదు గదులు ఉన్న ఒక రేకుల షెడ్ ఉంది. ప్రధాన భవనంలో ఆఫీసు కార్యాలయం, కిచెన్, ఆర్వో ప్లాంట్ ఉండగా, మరోభవనంలో ఆరు తరగతి గదులు ఉన్నాయి. ఆ గదుల్లోనే విద్యార్థులు పగటిపూట చదువుకోవడంతో పాటు రాత్రిపూట అదే గదుల్లో నిద్రపోతారు. మరోవైపు రేకుల షెడ్డులో ఐదు తరగతి గదులు ఉన్నాయి. ఇందులో సైతం పగటి పూట ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తారు. రాత్రిపూట అదే గదుల్లో విద్యార్థులు నిద్రపోతారు.

**పాఠాలు అక్కడే...నిద్రపోవడం అక్కడే**

బీసీ గురుకుల పాఠశాలలో 336 మంది విద్యార్థులకు ప్రత్యేకంగా తరగతి గదులు, డార్మెట్రీలు లేవు. తరగతి గదులే వారికి రాత్రిపూట బసచేసే డార్మెట్రీలు. 5 నుంచి 9వ తరగతి వరకు ఒక్కోగదిలో 30 నుంచి 35 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఆఫీసు కార్యాలయానికి ఎదురుగా ఉన్న భవనంలో ఆరు గదులు ఉన్నాయి. ఒక్కో గదినే తరగతి గదిగా, డార్మెటరీలు మార్చారు. విద్యార్థులు తమతోపాటు తీసుకువచ్చిన ట్రంక్ పెట్టెలు, బస్తాలు, పుస్తకాల బస్తాలను అదే గదిలో పెట్టుకున్నారు. దీంతో తరగతి గదులు ఇరుకుగా మారాయి. అయినప్పటికీ అదే గదుల్లో ఉపాధ్యాయులు పగటి పూట పాఠాలు బోధిస్తున్నారు. రాత్రివేళల్లో అదే ఇరుకు గదుల్లో విద్యార్థులు నిద్రపోతున్నారు. మరోవైపు గురుకుల పాఠశాల గేటు పక్కగానే రేకులతో ఐదు తరగతి గదులు ఏర్పాటు చేశారు. ఈ గదుల్లో 7,8,9వ తరగతి విద్యార్థులు చదువుకోవడంతో పాటు ఆ గదుల్లోనే రాత్రి నిద్రపోతున్నారు. ఇరుకైన ఐదు గదుల్లోనే విద్యార్థులు తమ ట్రంక్ పెట్టెలు, బస్తాలు పెట్టుకుంటారు. పగటి పూట అదేగదుల్లో విద్యార్థులు పాఠాలు వినటం, రాత్రిపూట నిద్రపోతున్నారు. ఇరుకైన గదుల్లో 30 మందికిపైగా విద్యార్థులు ఉండటంతో నిద్రపోయే సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. పైకప్పు రేకులతో ఉండడంతో ఎండలు బాగా కాసినప్పుడు ఉక్కపోతతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గదుల్లో పైకప్పు రేకులు అక్కడక్కడా చిల్లులు పడ్డాయి. చిల్లులు ఉండటంతో వర్షం కురిసినప్పుడు వర్షం నీరు పడుకున్న విద్యార్థులపై పడుతున్నది. దీంతో విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లు పెట్టి వర్షంనీరు పడకుండా చూసుకుంటున్నారు. 8,9 తరగతి గదుల పక్కనే టాయిలెట్లు ఉండటంతో అక్కడి నుంచి వచ్చే దుర్గంధం భరించలేక ముక్కులు మూసుకుని పగలు పాఠాలు వినాల్సిన దుస్థితి ఉందని విద్యార్థులు చెబుతున్నారు. దోమల బెడద ఎక్కువగా ఉందని, ఫ్యాన్లు సరిగ్గా పనిచేయక దోమలు కుట్టి విషజ్వరాల బారినపడే ప్రమాదం ఉందని గురుకుల విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా తరగతి గదులు, డార్మెటరీలు లేకపోవటంతో ఇరుకైన గదుల్లో ఒకచోట విద్యాభ్యాసం, ఒకేచోట నిద్రపోవాల్సి వస్తున్నదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో డైనింగ్‌రూమ్ లేక విద్యార్థులు నేలపై కూర్చుని భోజనం చేస్తున్నారు. గురుకుల పాఠశాలలో క్రీడల కోసం పీడీ ఉన్నప్పటికీ క్రీడా మైదానం లేదు.

## అద్దె భవనాల్లోనే బీసీ గురుకులాలు

సంగారెడ్డిలోనే బీసీ గురుకుల పాఠశాల ఒక్కటే కాదు మిగతా పది బీసీ గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. సరైన మౌలిక వసతులు లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో ఆరు బాలికల గురుకుల కళాశాలలు, నాలుగు బాలు ర కళాశాలలు ఉన్నాయి. పది గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నా యి. సంగారెడ్డికి మంజూరైన బీసీ మహి ళా గురుకుల డిగ్రీ కళాశాల ప్రస్తుతం వర్గల్‌లో కొన సాగుతున్నది. సంగారెడ్డి జిల్లా లో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కనీ సం అద్దె భవనం అధికారులు ఏర్పాటు చేయలేదు. దీంతో మహిళా డిగ్రీ కళాశాల వర్గల్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పది గురుకుల పాఠశాలలు, కళాశాలలకు కేసీఆర్ సర్కార్ సొంత భవనాల నిర్మా ణం కోసం స్థలాలను కేటాయించింది. గు రుకులాలు మంజూరైన చోటనే కేసీఆర్ స ర్కార్ ఐదు నుంచి ఎనిమిది ఎకరాల వర కు స్థలం కేటాయించింది. శాశ్వత భవనాల నిర్మాణం చేపడితేనే విద్యార్థుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

# అద్దె భవనాలు...అసౌకర్యాలు

- గురుకులాల్లో సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలం
- సమస్యలపై దృష్టి సారించని అధికారులు
- గురుకుల పాఠశాల పక్కనే మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతున్నాయి. విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా గురుకులాల సమస్యలపై సర్కారు దృష్టి సారించలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులకు సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాల భవనం పక్కనే పేరుకుపోయిన మురుగు

గజ్వేల్, ఆగస్టు 10: సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో ఎస్సీ బాలుర, బాలికలు, వర్గల్ మండలం చౌదర్‌పల్లి, కొండపాక మండల కేంద్రాల్లోని గురుకులాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తరగతులు ముగిసిన తర్వాత అవే గదుల్లో రాత్రి పడుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఒకే గదిలో 35 నుంచి 40మంది విద్యార్థులు రాత్రి సమయంలో పడుకోవడం ఇబ్బందికరంగా ఉన్నా తప్పనిసరిగా సర్దుకుంటున్నారు. అధికారులు సకాలంలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, టెస్ట్ బుక్స్, దుస్తులు పంపిణీ చేసినా వసతులు కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వినిపిస్తున్నాయి. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ రాజీవ్ రహదారి పక్కన అద్దె భవనంలో వర్గల్‌కు చెందిన ఎస్సీ బాలుర పాఠశాల, కళాశాలను నడిపిస్తున్నారు. ఈ గురుకుల పాఠశాల కిటికీల అద్దాలు పగిలిపోవడంతో రాత్రి సమయంలో దోమలతో విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. గురుకుల పాఠశాల పక్కనే మురుగు చేరడంతో దోమలు అధికంగా ఉంటున్నాయి. భవనం వెనుకాల మురుగు నీటి ప్రవాహంతో దుర్గంధమైన వాసన వెదజల్లుతున్నది. ఐదో తరగతి నుంచి పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన సుమారు 500పైగా విద్యార్థులు ఉన్నారు.



సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో ఎస్సీ గురుకుల పాఠశాల,కళాశాల భవనంలో పగిలిన కిటికీల అద్దాలు

## సరస్వతీ నిలయంలో సమస్యల తిష్ట



మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గురుకుల పాఠశాలలో వర్షాలకు స్లాబ్ నుంచి లీకవుతున్న వర్షం నీరు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 10: సరస్వతీ నిలయంలో సమస్యలు తిష్ట వేశాయి.వర్షం పడితే చాలు లీకేజీలు, డైనింగ్ హాల్ పక్కనే చెత్త కుప్పలు, ఆవరణలో కుక్కలు, కోతుల స్వైరవిహారంతో బాలికలు భయాందోళనకు గురవుతున్నారు. మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలకు చుట్టూ ప్రహరీ ఉన్నా వెనుక ప్రాంతంలో కొంతమేరకు లేక కుక్కలు వచ్చి స్వైరవిహారం చేస్తాయని.. వాటిని చూసి భయాందోళనకు గురవుతున్నామని బాలికలు మొరపెట్టుకుంటున్నారు. వానకాలం వచ్చిందంటే చాలు తరగతి గదుల్లో స్లాబు నుంచి నీరు లీకై ఇబ్బందులు ఎదురవుతున్నాయంటున్నారు. వరుసగా నాలుగైదు రోజులు వానవస్తే హాస్టల్ గదుల్లో స్లాబ్ నుంచి నీరురావడంతో ఉండలేని పరిస్థితి.. దీంతో ఇంటికి పంపిస్తున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. 5 నుంచి పదో తరగతి వరకు 480 మంది విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకగదిలో 40 మంది వరకు ఉండాల్సి వస్తున్నది. బాత్‌రూమ్‌లు లీకేజీలు అవుతున్నాయని విద్యార్థినులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.



మెదక్‌లోని తెలంగాణ గురుకుల పాఠశాలలో డైనింగ్ హాల్ పక్కనే చెత్తాచెదారం

## మైనార్టీ గురుకులంలో

# సమస్యల మధ్య చదువులు



సిద్దిపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో కిచిడి పేరిట విద్యార్థులకు వడ్డిస్తున్న అన్నం



గురుకుల పాఠశాలలో పనిచేయని సీసీ కెమెరాలు



సిద్దిపేటలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఆవరణలోనే తిరుగుతున్న కుక్కలు

సిద్దిపేట, ఆగస్టు 10:సిద్దిపేట పట్టణ శివారు ఎల్లంకి కాలేజీ ఆవరణలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో 339 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేక నిర్వహణ గాడి తప్పింది. అద్దె భవనంలో పాఠశాల కొనసాగుతున్నది. ప్రహరీ లేక విద్యార్థులు రక్షణ లేకుండా పోయింది. కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలను ఇప్పటి వరకు ఇవ్వలేదు. తరగతి గదుల తలుపులు ఊడిపోయి ఎప్పుడు పడిపోతాయో తెలియని పరిస్థితి ఉంది. సీసీ కెమెరాలు చాలా వరకు పనిచేయడం లేదు. పాఠశాలలో వారం రోజుల్లో 10 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై ఇంటికి వెళ్లారు.

**మెనూ అమలేదీ...**

మైనార్టీ గురుకుల పాఠశాలలో మెనూ సరిగ్గా అమలు కావడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. శనివారం రైస్ పొంగలి, చట్నీతో విద్యార్థులకు అల్పాహారం అందించాల్సి ఉండగా, కిచిడి, పచ్చి పులుసు పెట్టారు. ఉదయం పచ్చి పులుసు తినడంతో విద్యార్థులకు ఎసిడిటీ బారినపడే అవకాశం ఉంది. మధ్యాహ్న భోజనం శనివారం వెజిటేబుల్ కర్రీ, రైస్, పప్పు ఆకుకూర, రసం, పెరుగుతో వడ్డించాలి. కానీ, అన్నం, బీరకాయ కూర, పప్పుచారు, పెరుగుతో వడ్డించారు. 5 నెలల నుంచి బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వంట నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన రిఫ్రిజిరేటర్ పాడైపోయింది. దానిని బాగు చేయించక పోవడంతో మూలనపడింది. వాష్ రూమ్‌లు, మరుగుదొడ్లలో విద్యార్థులకు వాడేందుకు ప్రభుత్వం బకెట్లను అందజేయగా, వాటిని మూలన పడేశారు. ఐదుగురు వంట కార్మికులకు నలుగురు మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడంతో పాటు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లడంతో ఆ సీటు ఖాళీగా ఉంది. దీంతో తమ సమస్యలు ఎవరికి చెప్పాలో తెలియక విద్యార్థులు సతమతమవుతున్నారు.ఇటీవల బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాధ్యతలు ఇచ్చారు. అతను పూర్తిగా బాధ్యతలు చేపట్టలేదు. పూర్తిస్థాయి ప్రిన్సిపాల్‌ను నియమించడంతో పాటు తమ సమస్యలన్నీ పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



మైనార్టీ గురుకులంలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్న దర్వాజా, తడిసిన గోడపై ఊడిపోయిన స్విచ్ బోర్డు



ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ గది



కిటికీలకు అడ్డంగా కట్టిన ఫ్లెక్సీలు



సిద్దిపేట జిల్లా మల్లన్నసాగర్ నుంచి మర్కూక్ పంపుహౌస్ ద్వారా కొండపోచమ్మ సాగర్‌లోకి వస్తున్న జలాలు

# గోదావరి గలగలలు

సిద్దిపేట, ఆగస్టు 10 (నమస్తేతెలంగాణ ప్ర తినిధి): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధాన జలాశయాలు నిండుతున్నాయి. ఆరురోజులుగా గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు లేఖతో ప్రభుత్వం దిగివచ్చి జలాశయాలను నింపుతున్నది. ఒక వైపు రిజర్వాయర్లలో నీళ్లు లేక, మరోవైపు వర్షాలు పడక తీవ్ర ఆందోళనలో ఉన్న రైతుల పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయాలు పక్కనపెట్టి రైతులకు సాగునీటిని రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయకు సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లకు నీటిని పం పింగ్ చేయాలని కోరారు. కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం పక్షాన హరీశ్‌రావు ప్రభుత్వాన్ని కోరిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు గోదావరి జలాలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**దండగా అన్నోళ్లే ..ఇవ్వాళ హారతిస్తున్నారు..**

నాడు కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రా జెక్టులకు అడుగడుగునా అడ్డంకులు సృ ష్టించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏది వస్తే అదే మాట్లాడారు. ఇవ్వాళ అదే ప్రాజెక్టుకు ప్రభుత్వం, కాంగ్రెస్ నాయకులు హారతి పడుతున్నారు. మేడిగడ్డ మీద చిన్నపాటి లోపాన్ని భూతద్దంలో చూపెట్టి రాజకీయం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను తిట్టిపోశారు. సీఎం రేవంత్‌రెడ్డి, అతడి మంత్రివర్గ సహచరులు ఇష్టానుసారంగా మాట్లాడారు. మరీ ఇవ్వాళ అదే కాళేశ్వరం ప్రాజెక్టును ముద్దాడుతున్నారు. నీళ్లు రానే రావు ఎత్తిపోయడం కష్టం..ఇలా అనేక రకాలుగా మాట్లాడిన కాంగ్రెస్ పెద్దలు ఇవ్వాళ ఏం సమాధానం చెబుతారు..? కాళేశ్వరం ప్రాజెక్టులోని చివరి రిజర్వాయర్ అయిన కొండపోచమ్మకు గోదావరి జలాలు వచ్చా యి. ఇది ఎలా సాధ్యమైంది. కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఉంటే నీళ్లు వచ్చేవా....? ఒక్కసారి కాంగ్రెస్ నాయకులు ఆత్మ పరిశీలన చేసుకోవాలి. మల్లన్న సాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటికి నీళ్లు తీసుకుపోవడానికి ప్రత్యేక పైప్‌లైన్ కోసం రూ.5,560 కోట్లకుపైగా ప్రభుత్వం కేటా యించింది.

## జలాశయాల్లోకి జలాలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రాజరాజేశ్వర (మిడ్‌మానేరు) జలాశయం నుంచి రెండు పంపుల ద్వారా రోజుకు 6,400 క్యూసెక్కుల నీటిని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.22 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. ప్రస్తుతం అవుట్ ఫ్లో 6,600 క్యూసెక్కుల నీటిని రంగనాయకసాగర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. వచ్చిన నీటిని వెంట వెంటనే దిగువన ఉన్న రిజర్వాయర్లకు ఎత్తిపోస్తున్నారు. ప్రతి నీటి బొట్టును వినియోగించుకునేలా ప్రణాళిక సిద్ధం చేసి అందుకు అనుగుణంగా నీటిని విడుదల చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని రంగనాయక సాగర్‌కు ఈనెల 5 నుంచి చంద్లాపూర్‌లోని సర్జిపుల్ నుంచి రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. రిజర్వాయర్ సామర్థ్యం 3టీఎంసీలు కాగా ప్రస్తుతం నీటి సామర్థ్యం 2.05 టీఎంసీలుగా ఉన్నది. ఇన్‌ఫ్లో 6,600 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 5,200 క్యూసెక్కులు మల్లన్నసాగర్‌లోకి వస్తున్నాయి. ఈనెల 8 నుంచి మల్లన్నసాగర్‌లోకి తొగు ట మండలం తుక్కాపూర్ సర్జిపుల్ నుంచి 4 మోట ర్ల ద్వారా గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. దీని సామర్థ్యం 50 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామ ర్థ్యం 8.06 టీఎంసీలుగా ఉన్నది. ఇన్‌ఫ్లో 5,200 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 2,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మల్లన్నసాగర్‌లోకి రోజుకు 0.45 టీఎంసీల చొప్పున నీటిని లిఫ్టింగ్ చేస్తున్నారు. మల్లన్నసాగర్‌ను మొదటి సారిగా 20 20లో ప్రారంభించారు. నాలుగేండ్లుగా ఇప్పటి వరకు మొత్తం 41.35 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో చివరి రిజర్వాయర్ కొండపోచమ్మకు గోదావరి జలాలు చేరాయి. మర్కూక్ పంపు హౌస్ నుంచి రెండు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇన్‌ఫ్లో 2600 క్యూసెక్కులు కాగా అవుట్ ఫ్లో 2500 క్యూసెక్కుల నీటిని కొండపోచమ్మ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. దీని సామర్థ్యం 15 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి సామర్థ్యం 4.07 టీఎంసీలుగా ఉన్నది. సిద్దిపేట జిల్లాలోని అన్ని రిజర్వాయర్లకు గోదావరి జలాలు చేరుతుండడంతో జలకళను సంతరించుకుంటున్నాయి.


# ప్రజలకు ఏ కష్టమొచ్చినా నేనుంటా

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



సిద్దిపేటలో సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేట, ఆగస్టు 10: ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో 217 మందికి 49.91 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ హామీలు ఎగ్గొడుతూ ప్రజలను మోసం చేస్తున్నదన్నారు. ఏ ఒక్క పథకం సరిగ్గా అమలు కావడం లేదన్నారు. జీపీలకు నిధులు రావడం లేదన్నారు. గ్రామాల్లో చెత్త పేరుక పోతున్నదని, ట్రాక్టర్ డీజిల్‌కు, సఫాయి కార్మికులకు వేతనాలు ఇవ్వడానికి జీపీల్లో డబ్బులు లేవన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ రెసిడెన్షియల్‌లో పని చేసే కార్మికులకు సరిగ్గా వేతనాలు రావడం లేదన్నారు. గ్రామాల్లో కుక్కలు దాడులు చేస్తున్నాయని, వసతి గృహాల్లో ఎలుకలు కొరుకుతున్నాయని, మార్పు అంటే ఇదేనా అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. పారిశుద్ధ్య నిర్వహణ లేక దోమలు,ఈగలతో డెంగీ, సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదన్నారు. తమకు ఏడు నెలల పెండింగ్ వేతనాలు ఇప్పించాలని పుల్లూరులో పంచాయతీ సఫాయి కార్మికులు హరీశ్‌రావు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు పాల సాయిరాం, కాముని శ్రీనివాస్, గుండు భూపేశ్, కుంభాల ఎల్లారెడ్డి, మట్టె బాల్‌రెడ్డి, కీసర పాపయ్య, గ్యాదరి రవీందర్, మల్లికార్జున్, అరవిందరెడ్డి, ఎర్ర యాదయ్య, జాప శ్రీకాంత్‌రెడ్డి, ఒగ్గు బాలకృష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటలో కార్యక్రమానికి హాజరైన ప్రజలు, కార్యకర్తలు

# వనజకు అభినందనల వెల్లువ

## ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వీక్షణకు ఆహ్వానం



మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 10: ఢిల్లీ ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను వీక్షించడానికి మెదక్ జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా కళాశాల విద్యార్థిని వనజకు ఆహ్వానం వచ్చినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాదేవి శనివారం విలేకరులకు తెలిపారు. వనజ డిగ్రీ బీజెడ్‌సీ తృతీయ సంవత్సరం చదువుతూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో పాటు ప్రజలకు వివిధ పథకాలపై అవగాహన కల్పించారన్నా రు. ఇందుకు ఆగస్టు 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వీక్షించడానికి పిలుపు వచ్చిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శరత్‌దీపిక, కళాశాల అధ్యాపకులు వనజను అభినందించారు.